ఆట స్థలాలు అధ్వానం


షిర్డీ నగర్ గాంధీజీ విగ్రహం వద్ద పార్కులో పెరిగిన తుప్పలు


షిర్డీ నగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్కుస్థలం

- నిరుపయోగంగా పార్కులు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

ఏలేశ్వరం: రోజంతా కష్టపడి అలసిపోయి కాసేపు ఉపసమనం పొందేందుకు పార్కులకు వెళతారు. అక్కడ చక్కటి ఆటలు ఆడుకునేందుకు పిల్లలు ఎంతోగానో ఇష్టపడతారు. పిల్లలే కాదు పెద్దలు, వృద్ధులు కూడా ఇక్కడ సేదతీరుతారు. అలాంటి పార్కులు, వాటికి కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని సుమారు పది పార్కులు ఉన్నాయి. అవి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం పట్టణ పరిధిలోని పంట భూములను, ఖాళీ స్థలాలను లేఅవుట్‌లుగా మారిస్తే కొంత స్థలం పార్కుకు కేటాయించాల్సి ఉంటుంది. నగర పంచాయతీగా హోదా వచ్చిన నాటి నుంచి పట్టణంలో పలు చోట్ల లేఅవుట్లు వేశారు. వీటి నిమిత్తం కేటాయించిన పార్కుస్థలాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ఈ స్థలాలు కొన్నిచోట్ల అక్రమణలకు గురి అవుతుండగా మరికొన్ని చోట్ల తుప్పలు పేరుకుపోయాయి. స్థానిక షిర్డినగర్ గాంధీజీ విగ్రహం వద్ద నిర్మించిన పార్కు తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా పార్కు నిర్మించి దాదాపు ఐదేళ్లవుతున్నా ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడం విశేషం.

నిరుపయోగంగా స్థలాలు

పట్టణంలో పార్కులుగా కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారాయి. స్థానిక పెద్దవీధి, షిర్డి నగర్, షిర్డినగర్ గాంధీజీ విగ్రహం, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లో పార్కులు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ప్రాంతాల్లో స్థలాలు ఉన్నాయి. స్థలాలు చాలాచోట్ల అక్రమణలు గురయ్యే ప్రమాదం అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్థలాలు వినియోగంలోని తేవాలి

పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు వినియోగంలోకి తీసుకురావాలి. పార్కుల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించాలి. స్థలాలు ప్రజలు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించాలి.
– కె.శ్రీనివాసరావు, ఏలేశ్వరం

కోటి బిల్వార్చనకు ముదునూరి రూ.లక్ష విరాళం


ప్రత్తిపాడులో నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: కార్తిక మాసం తొలి సోమవారం జరిగిన అయ్యప్ప స్వామి కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవ నిర్వాహణకు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్‌ను నిర్వాహక కమిటీ సభ్యులకు అందజేశారు. కోటి బిల్వార్చన వేదికను ఆయన సందర్శించారు. బిల్వార్చనకు విచ్చేసిన పందళరాజ్య వంశీకులను ముదునూరి మురళీకృష్ణంరాజు కలిశారు. ఆయన వెంట ముదునూరి సీతారామరాజు, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, జువ్వల దొరబాబు స్వామి తదితరులున్నారు.

దేవీచౌక్ కమిటీ సభ్యులకు రూ.4 లక్షల చెక్కు అందజేత


ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న శ్రీనివాస్‌రావు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయ శరన్నవరాత్రి ఉత్సవాలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ప్రకటించిన విరాళంలో భాగంగా రూ.4 లక్షల చెక్కుని కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గతనెల అక్టోబర్‌లో తొమ్మిది రోజులపాటు దేవీచౌక్ కనకదుర్గ అమ్మవారి నవరాత్ర ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించారని, ఇప్పటికే రూ.3.5 లక్షల చెక్కుని అందించానన్నారు. వచ్చే ఏడాది ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, దేవి చౌక్ కమిటీ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

గండేపల్లి: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం క్షేత్రస్థాయి సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై ఏఓ సద్గురుమూర్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పంట కోత ప్రయోగాలు నియమాలకు లోబడి కచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి చంద్రమౌళి కోత ప్రయోగాలలో తీసుకోవాల్సిన మెలుకువలపై వివరించారు.

క్లుప్తంగా

శబరిమలలో భక్తులకు ఏర్పాట్లు


విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న నారాయణవర్మ, నీలకంఠ నంబూద్రి

అన్నవరం: కేరళలోని శబరిమలలో కొలువైన అయ్యప్పస్వామి వారి దేవాలయంలో నవంబర్ 16 నుంచి జనవరి 14వ తేదీ వరకూ పవిత్ర మాసాలలో స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా కేరళ ప్రభుత్వం, ట్రావన్‌కోర్ దేవస్థానం అన్ని ఏర్పాటు చేసిందని స్వామి అయ్యప్ప వంశీకులైన పందళ రాజ కుటుంబానికి చెందిన రాజా నారాయణ వర్మ తెలిపారు. సోమవారం ఆయన మాలికాపురం అమ్మవారి ఆలయ ప్రధాన తంత్రి(పూజారి) నీలకంఠ నంబూద్రితో కలిసి సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రత్తిపాడులో జరిగిన అయ్యప్ప భక్తులు నిర్వహిస్తున్న కోటి బిల్వార్చన కార్యక్రమానికి విచ్చేసినట్టు తెలిపారు. స్వామి అయ్యప్ప ధరించిన బంగారు ఆభరణాలను పందళంలోని శ్రీకృష్ణుని ఆలయంలో నవంబర్ 16 నుంచి జనవరి 11వ తేదీ వరకు భక్తులు సందర్శించేందుకు వీలుగా ప్రదర్శనకు పెడుతున్నామని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రదర్శనకు ఉంటుందని తెలిపారు. జనవరి 11న తిరుఆభరణాలను ఊరేగింపుగా శబరిమలకు తీసుకువెళ్లి 14న అక్కడ ప్రదర్శనకు ఉంచుతారని తెలిపారు. సమావేశంలో తటవర్తి బద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

జగ్గంపేట: నియోజకవర్గంలో జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఇద్దరికి జరిమానా, నలుగురికి జైలు శిక్షను పెద్దాపురం న్యాయస్థానం విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలో డ్రంక్ డ్రైవ్ తనిఖీ నిర్వహించగా పట్టుబడిన వారిని సోమవారం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. న్యాయమూర్తి జి.కృష్ణశేషచార్య ఇద్దరికి రూ.10వేల చొప్పున జరిమానా, నలుగురుకి రెండు రోజులపాటు జైలు శిక్ష విధించారని వివరించారు. జగ్గంపేటలో పబ్లిక్ ప్లేస్‌లో మద్యం సేవించిన ముగ్గరికి రూ.600 చొప్పున జరిమాన విధించారని తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసేందుకు ర్యాలీగా వెళ్లిన రైతులు


బెండపూడి నుంచి ర్యాలీగా బయలుదేరిన రైతులు

తొండంగి: పచ్చని పొలాల్లో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలన్న డిమాండ్‌తో మండలంలోని బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, అన్నవరం గ్రామాలకు చెందిన భూముల రైతులందరూ కలిసి డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు ర్యాలీగా సోమవారం పిఠాపురం తరలివెళ్లారు. రెండు గ్రామాలకు చెందిన రైతులంతా కార్లు, బైకులపై బెండపూడి జాతీయ రహదారి జంక్షన్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి ర్యాలీగా పిఠాపురం వెళ్లారు.

జీడిమామిడి పంటకు బీమా

గోకవరం: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా ఉద్యాన శాఖ ద్వారా జీడిమామిడి పంటకు వాతావరణ ఆధారిత పంట బీమా అమలు చేసినట్టు కోరుకొండ ఉద్యానశాఖ అధికారి పి.రిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడిమామిడి పంట బీమా చేయడానికి ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కేటాయించబడిందని, ఒక ఎకరాకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఈకేవైసీ నమోదు చేసుకున్న విస్తీర్ణానికి రైతులు ఈనెల 15 నాటికి బీమా చెల్లించడానికి గడువు ఉందన్నారు. ఇప్పటికే బ్యాంకులో రుణం పొందిన రైతులు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం రాజ్‌కుమార్ 9290033325, గ్రామ రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏలు, విహెచ్ఏలను సంప్రదించాలన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా పెంపుకు కృషి చేస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం ఆస్పత్రి ఆవరణలో జరిగింది. ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ వనజాకుమారి కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆస్పత్రికి స్థానిక వార్డు సభ్యుడు చిటికల పాండు 25 ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. సర్పంచ్ కొమరం శ్రావణి ఆధ్వర్యంలో పంచాయతీ నిధుల నుంచి రూ.5 లక్షలతో బోరు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో అంబేడ్కర్‌నగర్‌లో రూ.3 లక్షలు, పాతగుబ్బాలమ్మ వీధిలో రూ.2 లక్షలు, ఎస్సీబాలుర వసతి గృహంలో రూ.2 లక్షలతో నిర్మించిన సత్యసాయి మంచినీటి ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ప్రత్తిపాడులో మహిళా అఘోరా

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో సోమవారం సాయంత్రం మహిళా అఘోరా దర్శనమిచ్చింది. విజయవాడ నుంచి విశాఖ వెళ్తూ ఆమె ప్రయాణిస్తున్న కారులో పెట్రోల్ కోసం స్థానిక జాతీయ రహదారిపై ఉన్న దీప్తి సర్వీసింగ్ పెట్రోల్ బంక్ వద్ద ఆగారు. అక్కడే ఉన్న భవానీల కోరిక మేరకు ఆమె వాహనం దిగింది. కారులోంచి దిగిన ఆమెను ఆశ్చర్యంతో తిలకించారు. కొద్దిసేపు తర్వాత ఆమె విశాఖ వైపు సాగిపోయింది.

అస్సాగో ఇథనల్ పరిశ్రమను మూసివేయాలి


అస్సాగో ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

గోకవరం: గుమ్మళ్లదొడ్డి గ్రామంలో నిర్మించిన అస్సాగో ఇథనల్ పరిశ్రమను ప్రజాభీష్టం మేరకు మూసివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూ(విజృంభణ), పారిశుద్య కార్మికుల సమాఖ్య తదితర ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల ప్రతినిధులు అస్సాగో ఇథనల్ పరిశ్రమను పరిశీలించారు. తొలుత వీరిని పోలీసులు అడ్డుకోగా పోలీసులకు, వారికి మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం పోలీసులు అనుమతితో ఆందోళన విరమించి పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అస్సాగో ఇథనల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. భూగర్భజలాలు కలుషితమై మంచినీటి కొరత ఏర్పడుతుందన్నారు. దీనిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. లేకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, కుంచె అంజిబాబు, కె.సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా రిమ్‌జిమ్ ప్రారంభం


వివిధ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో రిమ్‌జిమ్–24 కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ తుని, పాయకరావుపేట, అన్నవరం బ్రాంచిల నుంచి 4500 మంది విద్యార్థులు పాల్గొనున్నట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాహిత్యం, సంగీతం, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ తదితర అంశాలపై జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో 29 రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9తో ఈ కార్యక్రమం ముగుస్తుందని వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు



పోటీల్లో ఉపన్యసిస్తున్న విద్యార్థి

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు(రంగం) కార్యక్రమాన్ని సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు శ్రీపాద సత్యనారాయణ, సోమయాజుల వెంకటేశ్వర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు వీర్రాజు, కిషోర్ రెడ్డి, నాగిరెడ్డి, దాసరి నాగేశ్వరరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలి

ఎంపీడీఓ బుజ్జి, ఎంపీపీ దొరబాబు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: సర్వసభ్య సమావేశానికి ప్రతి శాఖ అధికారి తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ నాతి బుజ్జి అన్నారు. మండల కేంద్రమైన గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరుకాకపోతే తదుపరి చర్యలకు బాధ్యులవుతారని ముఖ్యంగా పూర్తి సమాచారంతో సమావేశానికి పాల్గొనాలన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంపై ఆమె ఆగ్రహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా గ్రామాలలో సమస్యలను పరిష్కరించేందుకు కలిసి పనిచేద్దామన్నారు. అనంతరం అధికారుల వారి పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పరిమి వెంకట లక్ష్మి మంగతాయారు. వైస్ఎంపీపీ బిత్రా వెంకట లక్ష్మి, ఏఓ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే పోలీసుల లక్ష్యం

జగ్గంపేట: మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసుల పని చేస్తున్నారని, మహిళలకు చేరువుగా మహిళా రక్షక్ అనే కార్యక్రమాన్ని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో ప్రారంభించామని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మహిళా రక్షక్ కార్యక్రమం ప్రారంభించారు. దీనిపై విద్యార్థులకు వివరించారు.

గండేపల్లి: మహిళల భద్రతే మహిళా రక్షక్ లక్ష్యమని సీఐ వైఆర్కే శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మహిళలకు చేరువగా మహిళా రక్షక్ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం మహిళా పోలీసులకు రక్షక ద్విచక్ర వాహనాలు అందజేసినట్టు తెలిపారు.

'బీమా సౌకర్యం' వినియోగించుకోండి

ఏలేశ్వరం: జీడిమామిడి తోటలకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లీ అన్నారు. కొండతిమ్మాపురంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొండతిమ్మాపురంలో జీడిమామిడి తోటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఈనెల 15లోగా రైతులు రూ.1500 చెల్లిస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ 30వరకూ బీమా వర్తిస్తుందన్నారు. బీమా మూడేళ్లపై బడిన తోటలకు మాత్రమే బీమా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, పెంటకోట శ్రీధర్, ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో వెల్లువిరిసిన ఆధ్యాత్మికత


బిల్వార్చనకు హాజరైన అయ్యప్పస్వాములు, మహిళా భక్తులు


జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న పందల రాజు


కోటి బిల్వార్చన ప్రాంగణం వద్ద అయ్యప్పస్వామి నమూనా ఆలయం

- అత్యంత వైభవంగా లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చన
- అయ్యప్పస్వాములతో కిక్కిరిసిపోయిన ప్రాంగణం

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చన వైభవం జరిగింది. స్థానిక జాతీయ రహదారి ఆనుకొని ప్రత్తిపాడు– రాచపల్లి అడ్డురోడ్డు మధ్యలో అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ ఆధ్వర్యంలో లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా భవరిమలైన సన్నిదానం నుంచి ఆలయ ప్రధాన అర్చకులు మేల్ రాజ్, పదళరాజ్య వంశీకులు తరలివచ్చారు. లక్ష్మీగణపతి హోమం, చండీహోమం పూర్ణాహుతి, దండపాణి గురువర్యుల గరుపూజోత్సవం, ప్రత్తిపాడులో అయ్యప్పస్వామి అష్టాదశ కలశాలను ఊరేగించారు. అనంతరం కోటి బిల్వార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి అయ్యప్పస్వామి భక్తులు, మహిళలు తరలిచ్చి లక్ష దీపాలు వెలిగించి కోటి బిల్వార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో సభ ప్రాంగాణంలో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. భారీగా తరలివచ్చిన భక్తులతో 16వ నంబర్ జాతీయ రహదారి కిక్కిరిసిపోయింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐ సూర్యఅప్పారావు, ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మహిళా వలంటీర్లు 400, పురుష వలంటీర్లు 200 వందల మంది ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నేత సభా ప్రాంగాణంలోనే రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కమిటీ సభ్యులు చంటి గురుస్వామి, ప్రదీప్ గురుస్వాముల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం


చంద్రమ్మకు ఆర్థిక సహాయం అందజేసిన యనమల గోవిందరాజు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: భర్త క్యాన్సర్‌తో మృతి చెందగా ముగ్గురు ఆడపిల్లలతో తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబానికి స్ఫూర్తి ఫౌండేషన్ అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించింది. వేమవరం పంచాయతీ పంపాదిపేట గ్రామానికి తుట్టా అప్పలకొండ భార్య చంద్రమ్మ, వీరికి ముగ్గురు ఆడపిల్లలు, చేపల వేట ద్వారా కుటుంబాన్ని పోషించేవాడు. అప్పలకొండ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ పది రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో చంద్రమ్మ ముగ్గురు ఆడప్లిలలతో కుటుంబ జీవనం కష్టంగా మారడంతో వేమవరం గ్రామపెద్ద యనమల గోవిందరాజు రూ.10 వేలు, దాతల సహాయంతో స్ఫూర్తిఫౌండేషన్ ద్వారా మరో రూ.10 వేలు కలిపి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని చంద్రమ్మకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీనివాసరావు, సభ్యులు రాజేష్, కృష్ణ,లోవరాజు, శెట్టిబలిజ సంఘం నాయకులు హరిబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ..!

- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


ఏలేశ్వరం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


పంచాయత ఆలయంలో స్వామి వారి విశేషాలంకరణ


తపోవనం ఆశ్రమంలో కార్తిక పూజలు చేస్తున్న సరస్వతీ మహాస్వామి

ఏలేశ్వరం: కార్తికమాసం తొలి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే శ్రీసత్యనారాయణస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయలోని వేంకటేశ్వర స్వామి, సీతారాముల ఉప ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు అయ్యప్పస్వాములు, శివస్వాములు, మహిళలు, భక్తులతో ఆలయాలు నిండిపోయాయి. ఆలయాల వద్ద మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. సిరిపురంలో స్వామివారిని గ్రామ పురవీధుల్లో పల్లకీపై ఊరేగించారు. అర్చకుడు వై.రామకృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు శైవక్షేత్రాలను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. శృంగవరం–మెరక చామవరం సమీపంలో నందనవనంలో స్వయంభుగా వెలసిన ఉమా వర్ధినీ నాగలింగేశ్వరస్వామివారి ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. రౌతులపూడిలోని ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకుడు దొంతమూర్తి సుబ్రహ్మణ్యం స్వామివారికి పూజలు చేశారు. గంగవరం మల్లికార్జుని లొద్దిలో వెలసిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఎస్ఎన్ పట్నం సమీపంలోని లొద్దిలో కొండల్లోంచి జారుతున్న జలదారల్లో భక్తులు స్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

కిర్లంపూడి: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిల్లంగిలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారికి పాలు, పండ్లు రసాలతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక పరసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వచ్చే నెల ఒకటో తేదీ వరకూ ప్రతి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

ప్రత్తిపాడు: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయం భక్తులతో నిండిపోయింది. వందలాది మంది భక్తులు వేకువజాముననే స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు ధ్వజస్తంబం వద్ద, శమీవృక్షం, రావి చెట్టు వద్ద దీపారాదనలు నిర్వహించారు. స్వామి వారికి నిర్వహించిన సామూహిక అభిషేకాలలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. తెల్లవారుజామున ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో అర్చకులు విఘ్నేశ్వర పూజతో విశేష అర్చనలకు శ్రీకారం చుట్టారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అభిషేకానంతరం స్వామివారిని గజమాల, జటాఝూటంతో విశేషంగా అలంకరించారు. మండలంలోని పెదశంకర్లపూడి, ఏలూరు తదితర గ్రామాల్లో తెల్లవారుజామున నగర సంకీర్తన నిర్వహించారు. గోమాతను గ్రామ ప్రదక్షిణ గావించారు. తమ ఇళ్ళ ముంగిటకొచ్చిన గోమాతకు మహిళలు పూజలు చేసి, హారతులిచ్చారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తుని రూరల్: కార్తికమాసం తొలి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు శైవక్షేత్రాలను సందర్శించి, స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. తేటగుంట, టి.తిమ్మాపురం, హంసవరం, చామవరం, జగన్నాథగిరి, చేపూరు, తదితర గ్రామాల్లో ఆలయాలకు తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసీ దళాలతో స్వామివారికి విశేష పూజలు చేశారు. వేద పండితులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో కోనేటిలో కార్తిక దీపాలు విడిచిపెట్టారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి వారి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు పోటెత్తారు. కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి శ్రీబాలత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గోకవరంలోని మురళీనగర్‌లో సాయిబాబా ఆలయంలో కొలువై ఉన్న సోమేశ్వరస్వామి, తంటికొండలో అఖిలాండేశ్వరి సమేత జంబుకేశ్వరస్వామి వారి ఆలయం, కృష్ణునిపాలెంలోని పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

తొండంగి: కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో మండలంలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. బెండపూడిలో విశ్వేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, పూజలు జరిగాయి గోపాలపట్నం ఉమారామలింగేశ్వరాలయంలోనూ, తొండంగి రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ, ఒంటిమామిడి, పైడికొండ, శృంగవృక్షం, పి.ఇ.చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి తదితర శివాలయాల్లో అభిషేకాలు, పూజలు జరిగాయి.